అవన్నీ అవాస్తవాలు

'పుష్ప-2' సినిమా విషయంలో వినిపిస్తున్న నెగిటివ్ వార్తల్లో నిజం లేదని చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీమేకర్స్ ప్రకటించింది. వివరాల్లోకెళ్తే ఈ సినిమా షూటింగ్ ఆలస్యం అవుతుండటంతో దర్శకుడు సుకుమార్ పనితీరుపై అల్లు అర్జున్ అసంతృప్తితో ఉన్నారని, సినిమా షూటింగ్ కూడా ఆగిపోయిందని, 'పుష్ప' పాత్ర కోసం పెంచిన గడ్డాన్ని బన్నీ ట్రిమ్ చేసుకున్నది కూడా ఇందుకేనని పలు కథనాలు వెబ్ మీడియాలో కనిపిస్తున్నాయి. వీటిని చిత్రబృందం ఖండించింది. 'పుష్ప-2' విషయంలో అలాంటి వాటికి ఏమాత్రం తావు లేదని, సుకుమార్ ఎప్పటిలాగే తన పని తాను చేసుకుంటూ వెళ్తున్నారని, అనుకున్నట్టే డిసెంబర్6న 'పుష్ప-2' ఎట్టిపరిస్థితుల్లో విడుదల చేస్తామని మేకర్స్ చెప్పారు. ఇదిలావుంటే.. ఈ నెల 25 నుంచి 'పుష్ప -2' కొత్త షెడ్యూల్ మొదలు కానున్నదట. ఈ నెల 28 నుంచి బన్నీ షూటింగ్‌లో పాల్గొంటారని, ఈ షెడ్యూల్‌లోనే కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారని సమాచారం. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ స్వరాలందిస్తున్న విషయం తెలిసిందే.

నిన్ను కన్న కనులే..

తమిళ అగ్ర కథానాయకుడు దళపతి విజయ్ తాజా చిత్రం 'GOAT' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్). వెంకట్‌ప్రభు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తున్నది. సైన్స్‌ఫిక్షన్, దేశభక్తి ప్రధాన అంశాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ఈ చిత్రంలోని సెకండ్ సింగిల్ 'నిన్ను కన్న కనులే' పాటను గురువారం విడుదల చేశారు. కుటుంబ బంధాలను ఆవిష్కరిస్తూ సాగిన ఈ పాటను రామజోగయ్యశాస్త్రి రచించారు. యువన్‌శంకర్‌రాజా సంగీతాన్ని అందించిన ఈ పాటను ఎస్పీ చరణ్, చిత్ర ఆలపించారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమా తెలుగు వెర్షన్‌ను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ విడుదల చేయనుంది.

తెలివైన సమాధానమిచ్చింది

రచయిత, సహాయ దర్శకుడు రాహుల్ మోడితో నటి శ్రద్ధాకపూర్ అనుబంధంలో ఉన్నట్టు చాలా రోజులుగా బీటౌన్‌లో ప్రచారం జరుగుతున్నది. అతనితో కలిసి శ్రద్ధా దిగిన సెల్ఫీలు కూడా సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యాయి. 'తూ ఝూఠీ మై మక్కార్' సినిమా టైమ్‌లో వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించిందని, త్వరలో ఈ జంట పెళ్లి పీటలు ఎక్కనున్నారని కథనాలు కూడా వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో తన తాజా చిత్రం 'స్త్రీ 2' ప్రమోషన్స్‌లో పాల్గొన్న శ్రద్ధకు ఓ విలేకరి ద్వారా తన పెళ్లికి సంబంధించిన ప్రశ్న ఎదురైంది. దీనికి ఆమె తెలివిగా, 'స్త్రీ 2' చిత్రంలోని తన పాత్ర గురించీ, తన గురించీ ఒకే సమాధానం చెప్పేసింది. 'స్త్రీ తనకు ఇష్టమైనప్పుడు ఇష్టమైన వాడ్ని పెళ్లిచేసుకుంటుంది.' అంటూ సింపుల్‌గా తేల్చేసింది శ్రద్ధ. ఇక ఆమె తాజా సినిమా 'స్త్రీ2' విషయానికొస్తే, ఆగస్ట్ 15న స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఈ సినిమా విడుదల కానుంది. అమర్ కౌశిక్ ఈ చిత్రానికి దర్శకుడు.

డిసెంబర్‌లో 'కన్నప్ప'

మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న భక్తిరస ప్రధాన చిత్రం 'కన్నప్ప'. శ్రీకాళహస్తి స్థలపురాణం ఆధారంగా తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో మోహన్‌లాల్, శరత్‌కుమార్, అక్షయ్‌కుమార్, మోహన్‌బాబు, ప్రభాస్ వంటి అగ్ర తారలు భాగమయ్యారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. విజువల్స్ కూడా ఆకట్టుకున్నాయి. ఈ సినిమా విడుదల గురించి హీరో మంచు విష్ణు మరోసారి క్లారిటీ ఇచ్చారు. ముందుగా ప్రకటించినట్లుగా డిసెంబర్‌లోనే విడుదల చేస్తామని ట్వీట్ చేశారు. భారీ సాంకేతిక హంగులతో ప్రేక్షకులకు నవ్యానుభూతిని అందించేలా ఈ సినిమాను తెరకెక్కించామని మంచు విష్ణు తెలిపారు. ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు.

న్యూ ఏజ్ యాక్షన్ థ్రిల్లర్

రక్షిత్ అట్లూరి కథానాయకుడిగా, రాధిక శరత్‌కుమార్ కీలక పాత్రలో రూపొందిన న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్ 'అపరేషన్ రావణ్'. తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కిన ఈ ద్విభాషా చిత్రానికి వెంకటసత్య దర్శకుడు. ధ్యాన్ అట్లూరి నిర్మాత. ఈ నెల 26న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కు మంచి స్పందన వస్తున్నదని, సస్పెన్స్ థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో అందరినీ ఆకట్టుకునేలా సినిమా ఉంటుందని మేకర్స్ తెలిపారు. చరణ్‌రాజ్, విద్యాసాగర్, కాంచి, రాకెట్ రాఘవ, రఘు కుంచె, కె.ఏ.పాల్ రాము, టీవీ5 మూర్తి తదితరులు ఇతర పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి మాటలు: లక్ష్మీ లోహిత్ పూజారి, కెమెరా: నాని చమిడిశెట్టి, సంగీతం: శరవణ వాసుదేవన్.

24ఏండ్ల జీవితం మట్కా

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా రూపొందుతోన్న పీరియాడిక్ పాన్ ఇండియా యాక్షన్ డ్రామా 'మట్కా'. కరుణకుమార్ దర్శకుడు. డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మాతలు. 1958 నుంచి 1982వరకూ అంటే, ఇరవైనాలుగేండ్లపాటు సాగే కథతో, ఊహించని మలుపులతో సాగే చిత్రమిది. ఇప్పటికే హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో కీలకమైన భారీ షెడ్యూల్ పూర్తయింది. పాతకాలం నాటి వైజాగ్‌ని తలపించేలా నిర్మించిన మ్యాసివ్ సెట్‌లో కథలోని కీలక సన్నివేశాలతోపాటు, భారీ యాక్షన్ ఎపిసోడ్స్‌నీ.. అలాగే రెట్రో థీమ్ సాంగ్స్‌ని మేకర్స్ చిత్రీకరించారు. ప్రమోషన్‌లో భాగంగా ఇందులో ఓ కథానాయికగా నటిస్తున్న నోరా ఫతేహీ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. నోరా డాన్సులు సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయని, ముఖ్యంగా జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో చేసిన పాటను నంబర్ ఆఫ్ డాన్సర్‌తో గ్రాండ్‌గా షూట్ చేశామని, ప్రస్తుతం కొత్త షెడ్యూల్ వైజాగ్‌లో శరవేగంగా జరుగుతున్నదని మేకర్స్ తెలిపారు. మీనాక్షి చౌదరి మరో కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో నవీన్ చంద్ర, అజయ్‌ఘోష్, కన్నడ కిశోర్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: ఏ.కిశోర్‌కుమార్, సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్, నిర్మాణం: వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్ ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్.

మెకానిక్ యాక్షన్ హంగామా

యువ హీరో విశ్వక్‌సేన్ 'మెకానిక్ రాకీ'గా ప్రేక్షకులను పలకరించబోతున్నాడు. యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ద్వారా రవితేజ ముళ్లపూడి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. రామ్ తాళ్లూరి నిర్మాత. ఈ చిత్రాన్ని దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విడుదల చేసిన కొత్త పోస్టర్‌లో విశ్వక్‌సేన్ ఓ చేతిలో గన్, మరో చేతిలో మెకానిక్ రెంచ్ పట్టుకొని మాస్ అవతారంలో కనిపిస్తున్నారు. ఆయన్ని సరికొత్త పంథాలో ఆవిష్కరించే మాస్ యాక్షన్ చిత్రమిదని దర్శకుడు తెలిపారు. మీనాక్షి చౌదరి, నరేష్, వైవా హర్ష తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతాన్నందిస్తున్నారు. రచన-దర్శకత్వం: రవితేజ ముళ్లపూడి.

భావోద్వేగ ప్రయాణం

'హుషారు'ఫేం తేజాస్ కంచర్ల కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'ఉరుకు పటేల'. వివేక్‌రెడ్డి దర్శకుడు. కంచర్ల బాలభాను నిర్మాత. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. హీరో తేజాస్ కంచర్ల పరుగెడుతుంటే, వెనుక ఎవరో కత్తిని విసిరేసినట్టు పోస్టర్‌లో కనిపిస్తున్నది. మరోవైపు మంగళసూత్రం, పోస్టల్ బ్యాలెట్ పేపర్, పాల క్యాన్.. ఇవన్నీ పోస్టర్‌లో కనిపిస్తున్నాయి. ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే భావోద్వేగ ప్రయాణమని, పోస్టర్ మాదిరిగానే సినిమా కూడా ఆసక్తిని రేకెత్తిస్తుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: సన్నీ కూరపాటి, సంగీతం: ప్రవీణ్ లక్కరాజు, నిర్మాణం: లీడ్ ఎడ్జ్ పిక్చర్స్.

పాటల పల్లకిలో 'స్వాగ్'

వరుస విజయాలతో జోరు మీదున్నాడు యువహీరో శ్రీవిష్ణు. ఆయన తాజా చిత్రం 'స్వాగ్'. హసిత్‌గోలి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా ప్రమోషన్స్‌ను మొదలుపెట్టారు. ఫస్ట్ సింగిల్ 'సింగరో సింగ'ను గురువారం విడుదల చేశారు. వివేక్‌సాగర్ స్వరపరచిన ఈ పాటను నిక్లేష్ సుంకోజీ రచించారు. బాబా సెహగల్, వైకోమ్ విజయలక్ష్మి ఆలపించారు. ఈ పాట ద్వారా హీరో పాత్రను పరిచయం చేశారు. విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. శ్రీవిష్ణు గత చిత్రాల తరహాలోనే వినూత్నమైన కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని మేకర్స్ తెలిపారు. ఈ సినిమాలో వింజమర వంశ మహారాణి రుక్మిణి దేవి పాత్రలో కథానాయిక రీతూ వర్మ కనిపించనుంది. మీరా జాస్మిన్, దక్ష నాగర్కర్, శరణ్య ప్రదీప్, సునీల్ తదితరులు చిత్ర తారాగణం.

జాన్వీకపూర్‌కు అస్వస్థత

బాలీవుడ్ నటి జాన్వీకపూర్ అస్వస్థతకి గురయ్యింది. ఆహారం కల్తీ కావడమే ఆమె అనారోగ్యానికి కారణం. ప్రస్తుతం ఆమె ముంబాయిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నది. ఈ విషయాన్ని ఆమె తండ్రి బోనీ కపూర్ వెల్లడించారు. జాన్వీ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉందని, రెండ్రోజుల్లో ఆమెను డిశ్చార్జ్ చేసే అవకాశం కూడా ఉందని ఆయన తెలిపారు. ప్రస్తుతం జాన్వీ కపూర్ బాలీవుడ్ సినిమాలతో పాటు తెలుగు సినిమాల్లో కూడా నటిస్తూ బిజీబిజీగా ఉన్నది.